సాక్షి
సూర్యాపేట
బుధవారం, 2, ఏప్రిల్, 2025



గంజాయి విక్రేతల అరెస్ట్
గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులు, ఒక బాలుడిని బీబీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



నకిలీ మద్యం గుట్టురట్టు
చండూరులో నకిలీ మద్యం దందాను చండూరు, కనగల్ టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీ పోలీసులు గుట్టురట్టు చేశారు. - 8లో



కాలువలో ఆటో బోల్తా
బరాఖత్‌గూడెం శివారులో గల ముక్యాల బ్రాంచ్ కాలువలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు గోదావరి జలాల విడుదల

- నాలుగు రోజుల పాటు సరఫరా

అర్వపల్లి: జిల్లావ్యాప్తంగా ఎస్సారెస్పీ రెండో దశ కింద 2.50 లక్షల ఎకరాల వరి సాగవుతోంది. యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాకు గోదావరి జలాల విడుదల షెడ్యూల్ ప్రకారం పూర్తయింది. కానీ వరి పంట చేతికందే దశలో నీటి సరఫరా నిలిచిపోవడంతో చేలు ఎండిపోతున్నాయి. కనీసం మరో విడత అయినా నీటిని వదిలి ఎండిపోతున్న పొలాలను కొంత వరకైనా కాపాడాలని అన్నదాతలు ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. దీంతో జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు ఎల్‌ఎండీ అధికారులపై తీవ్ర వత్తిడి తెచ్చి ఒప్పించి ఎట్టకేలకు కనీసం నాలుగు రోజులు నీటిని ఇవ్వాలని కోరగా అంగీకరించారు. ఎల్‌ఎండీ నుంచి రెండో దశకు నీటిని మంగళవారం వదిలారు. అయితే ఈ నీళ్లు బయ్యన్నవాగుకు చేరాక బుధవారం మధ్యాహ్నం బయ్యన్నవాగు నుంచి సూర్యాపేట జిల్లాకు విడుదల చేయనున్నట్లు డీఈఈ ఎం.సత్యనారాయణ తెలిపారు.

శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణం

మఠంపల్లి: ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణం మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీస్వామివారికి విశేష పూజలు, అర్చనలు గావించారు. అదేవిధంగా నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లకు ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి



మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు : పేద ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చిలుకూరు మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో సీపీఐ మహాసభలను ప్రారంభించి మాట్లాడారు. పాలకులకు కార్పొరేట్ శక్తులపై ఉన్న ప్రేమ సామాన్య ప్రజలపై లేదని ఆరోపించారు. అనంతరం ఆ గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మూడోసారి కందుకూరి శ్రీను, సహాయ కార్యదర్శిగా కాటూరు బజారు, ఎరగాని వెంకన్న ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డా వెంకటయ్య, కీసర కొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిర్బంధాన్ని ఖండిస్తున్నాం

సూర్యాపేట అర్బన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ, సీపీఎం నాయకులపై పోలీసుల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ ఈ నెల 2న సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఫణిగిరి బౌద్ధ క్షేత్రం వద్ద భీమ్ దీక్ష

నాగారం : మహనీయుల ఆశయాలు సాధించేందుకు ప్రతిఒక్కరూ భీమ్ దీక్షలో భాగస్వాములు కావాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎర్ర రాంబాబు కోరారు. బుధవారం నాగారం మండల పరిధిలోని ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద స్వేరో కార్యకర్తలు మిరియాల మధు, మాచర్ల సైదులు భీమ్ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో రాంబాబు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఏడాది మార్చి 15న సాహెబ్ కాన్షీరామ్ జయంతి నుంచి భీమ్ దీక్ష ప్రారంభమై డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి రోజున దీక్ష ముగుస్తుందని తెలిపారు. మహనీయులను స్మరించుకుంటూ వారి ఆశయాలను సాధించడం కోసం భీమ్ దీక్ష చేపడుతున్నామన్నారు. ఈ దీక్షలో స్వేరో సభ్యులు చుక్క సురేష్, వడ్డేపల్లి భాష, ఎర్ర రమేష్, మామిడి రాంబాబు, ఎర్ర పరశురాం, ఎర్ర రఘు తదితరులు పాల్గొన్నారు.

పేదలు మురవంగా..!



అర్వపల్లిలో రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

జిల్లావ్యాప్తంగా రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ

- దుకాణాలకు తోరణాలు కట్టి ఆహ్వానం
- బియ్యం తీసుకెళ్లేందుకు క్యూ కట్టిన లబ్ధిదారులు
- 3,24,212 కార్డుదారులకు అందనున్న సన్నబియ్యం

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ అట్టహాసంగా మొదలైంది. మార్చి 30వ తేదీ ఉగాది రోజున సన్నబియ్యం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రారంభించిన విషయం విదితమే. ఏప్రిల్ నెల కోటా నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీని మంగళవారం జిల్లావ్యాప్తంగా అధికారులు చేపట్టారు. లబ్ధిదారులకు పండుగ వాతావరణంలో సన్నబియ్యం ఇవ్వాలని రేషన్ దుకాణాలను మామిడి తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మందుల సామేల్, సూర్యాపేట నియోజకవర్గంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఏఐసీసీ మెంబర్ రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి రేషన్ షాపులకు వెళ్లి లబ్ధిదారులకు బియ్యం అందించారు.

3,24,158 కార్డుదారులకు..

సూర్యాపేట జిల్లావ్యాప్తంగా 601 రేషన్ షాపులు ఉన్నాయి. 3,24,158 కార్డులు ఉండగా, దాదాపు 9.27 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ రేషన్ దుకాణాల ద్వారా ఇప్పటివరకు దొడ్డు బియ్యం అందుతోంది. ఈ బియ్యాన్ని లబ్ధిదారులు చాలావరకు వాడకపోగా పక్కదారి పట్టడాన్ని ప్రభుత్వం గుర్తించి సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఒక్కో వ్యక్తికి 6 కిలోల చొప్పున జిల్లాలో ఉన్న లబ్ధిదారులకు దాదాపు 5వేల మెట్రిక్ టన్నుల బియ్యం కావాల్సి ఉంది. ప్రభుత్వం సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించడంతో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు మిల్లర్ల నుంచి సీఎంఆర్ కింద ఈ మొత్తాన్ని తీసుకుని మార్చి నెలాఖరు నాటికే రేషన్ షాపులకు తరలించారు.

జిల్లాలోని రేషన్‌షాపులు	601
రేషన్‌కార్డులు	3,24,158
లబ్ధిదారులు	9,27,212

రేషన్ షాపుల వద్ద క్యూలైన్లు

ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇవ్వడంతో లబ్ధిదారులు మురిసిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మొదటిరోజే రేషన్ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ షాపుల వద్దకు పరుగులు పెట్టారు. కొన్నిచోట్ల ప్రజలు క్యూలైన్లు కట్టడం కనిపించింది. డీలర్లు సైతం షాపుల వద్ద మామిడి తోరణాలు కట్టి ముస్తాబు చేయడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఇక సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు సన్నబియ్యం పంపిణీని పరిశీలించారు.

వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ

జిల్లా వ్యాప్తంగా 601 రేషన్ షాపులకుగాను మంగళవారం 585 రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేశారు. సుమారు 51 వేల మంది రేషన్ కార్డుదారులకు వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేసినట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు.

సంతోషంగా ఉంది



గతంలో రేషన్‌షాపుల్లో ఇచ్చే దొడ్డుబియ్యం తినడానికి మంచిగా ఉండేవి కావు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తామని చెప్పి హామీని అమలు చేసింది. రేషన్ షాపులో సన్నబియ్యం తీసుకుంటుంటే సంతోషంగా ఉంది. నా రేషన్‌కార్డుపై 12 కిలోల సన్నబియ్యం తీసుకున్నా. పేదలకు ఈ బియ్యం ఎంతో ఆసరాగా నిలుస్తాయి.

–గోగుల నిర్మల, కొత్తగూడెం, తుంగతుర్తి

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

రేషన్ షాపుల ద్వారా మొదటిరోజు వెయ్యి మెట్రిక్ టన్నుల సన్నబియ్యం లబ్ధిదారులకు అందించాం. అంత్యోదయ, అన్నపూర్ణ, ఎఫ్‌ఎస్‌సీ లబ్ధిదారులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–రాజేశ్వర్ డీఎస్‌ఓ

హెచ్‌సీయూ భూముల వేలం విరమించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

సూర్యాపేట : హెచ్‌సీయూ భూముల వేలాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్, కో కన్వీనర్లు ఎల్.భద్రయ్య, రేపాక లింగయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ నాయకులు ఆర్.రామనర్సయ్య, పబ్బతి వెంకటేశ్వర్లు, పి.వీరన్న, కె.వేణు, సుభాని, వెంకటేశ్వర్లు, యాకయ్య, వెంకటయ్య, రవికుమార్, యోగానంద్, సింహాద్రి, వెంకన్న, సైదులు, శ్రీనివాస్, వెంకటరెడ్డి, రాంబాబు, రమాదేవి, అబ్దుల్ కరీం, వెంకట్‌యాదవ్, అశోక్‌రెడ్డి, నర్సింహారావు, హస్సేన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాలకు వేళాయే

- దరఖాస్తులకు నేడు చివరి తేదీ
- జిల్లాలో 10 శిబిరాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- మే 1 నుంచి క్రీడాకారులకు శిక్షణ

హుజూర్‌నగర్ : గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులను వెలికితీసి వారికి తర్ఫీదు ఇచ్చి అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించాలని తలపెట్టారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, జాతీయ స్థాయి క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు.

జిల్లాలో 10 క్రీడా శిబిరాలు..

క్రీడా శిబిరాల నిర్వహణ కోసం ప్రభుత్వం జిల్లాకు నిధులు కేటాయించనుంది. క్రీడా సామగ్రి కొనుగోలుకు నిధులతోపాటు, శిక్షకులకు ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున గౌరవ వేతనం అందజేయనుంది. ఇందుకోసం సూర్యాపేట జిల్లాలో 10 శిబిరాలకు రూ 4 వేల చొప్పున రూ.40 వేలు, నిర్వహణ ఖర్చు, ప్రథమ చికిత్స కిట్ల కొనుగోలుకు నిధులు ఇవ్వనున్నారు. శిబిరాల నిర్వహణకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, యువజన, క్రీడల శాఖ అధికారి శిబిరాల నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించనున్నారు. ఈ శిబిరాల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 2న చివరి తేదీగా ప్రభుత్వం నిర్ణయించింది.

14 ఏళ్లలోపు బాల, బాలికలకు మాత్రమే..

పూర్తిగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు వివిధ ఆటల్లో శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ శిబిరంలో చేరడానికి 14 ఏళ్లలోపు బాల బాలికలు మాత్రమే అర్హులు. జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఈ వేసవి క్రీడాశిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆయా క్రీడల్లో మెళకువలు నేర్చుకునేందుకు ఇది మంచి అవకాశం.

జిల్లా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి



ఆసక్తి గల శిక్షకులు నిర్వహించే క్రీడలు, ప్రదేశం, గ్రామం, సెల్ నంబర్ తదితర వివరాలతో కూడిన దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలి. ఈ నెల 2వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు చేయవచ్చు.

–జి.రాంచందర్‌రావు, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి, సూర్యాపేట

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడతారా

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి



మాట్లాడుతున్న చల్లా శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు బీజేపీ కార్యకర్తలు, నాయకులపై కేసులు పెడతారా అని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. మంగళవారం నేరేడుచర్ల బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సన్న బియ్యం పంపిణీకి కేంద్ర ప్రభుత్వం రూ.40 భరిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీలో రూ.10 మాత్రమే ఖర్చు చేస్తూ గొప్పలు చెప్పుకుంటోందన్నారు. సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలను అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. సమావేశంలో బాల వెంకటేశ్వర్లు, తాళ్ల నరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, వీరబాబు, నర్రినాయక్, లాజర్, విజయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శంకర్‌రెడ్డి, నాగయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

కూల్ కూల్‌గా..






అర్వపల్లి శివారులోని రైతు సాయిని యాగానందం వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌లు వేసవిలో కిటకిటలాడుతున్నాయి. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో చిన్నారులు, యువకులు స్విమ్మింగ్ పూల్‌లలో ఈత కొడుతూ సేదదీరారు. -అర్వపల్లి

గురువులకు శిక్షణ

- జిల్లాలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు 714 మంది
- ఈ నెల 3, 4వ తేదీల్లో ట్రైనింగ్
- సమర్థవంతమైన బోధనే లక్ష్యం



సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధానంగా పాఠ్య ప్రణాళిక, విద్యా ప్రమాణాలు, బోధన సోపానాలు, అభ్యసన ఫలితాలు, కరికులం విధానాలపై గురువులకు అవగాహన కల్పించనున్నారు. జిల్లాలో 714 మంది ఉపాధ్యాయులు గత ఏడాది జూన్‌లో పదోన్నతి పొందారు. వీరందరికీ ఈ నెల 3, 4వ తేదీల్లో వృత్యంతర శిక్షణ ఇచ్చేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో రెండు రోజులపాటు ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇవ్వనున్నారు.

బోధనపై పట్టు పెరిగేలా..

విద్యార్థులకు జ్ఞానం అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో వీరి పాత్ర కీలకం. ఏళ్లుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు.. ఉన్నత పాఠశాలల్లో పరిస్థితులను ఆకళింపు చేసుకుని అందుకు తగ్గట్టుగా బోధన తీరును మెరుగుపరుచుకోవాలి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పిల్లల ప్రవర్తన, బోధన తీరు, పరీక్షల విధానం వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ఉద్యోగ ఉన్నతి పొందిన ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలుచేసేలా కార్యాచరణ రూపొందిస్తోంది. సీనియర్ ఉపాధ్యాయులతో కలిసి నిరంతరం కొత్త విషయాలను తెలుసుకుని నమగ్ర విద్య అందించేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

శిక్షణ పొందే ఉపాధ్యాయులు..	
జీహెచ్‌ఎంలు	100
ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు	116
ఎస్‌ఏ తెలుగు	126
ఎస్‌ఏ హిందీ	90
ఎస్‌ఏ ఇంగ్లిష్	31
ఎస్‌ఏ మ్యాథ్స్	49
ఎస్‌ఏ ఫిజిక్స్	04
ఎస్‌ఏ బయోసైన్స్	44
ఎస్‌ఏ సోషల్	71
ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	81
ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	02
మొత్తం	714

శిక్షణ కేంద్రాలు ఇవీ..

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు సబ్జెక్టుల వారీగా ఆయాచోట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. జీహెచ్‌ఎం, పీఎస్ హెచ్‌ఎంలకు ఈ నెల 3, 4 తేదీల్లో ఇమాంపేట మోడల్ స్కూల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే 3వ తేదీన స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయులకు దురాజ్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో, 3న ఎస్‌ఏ హిందీ ఉపాధ్యాయులకు సూర్యాపేట ప్రభుత్వ హైస్కూల్‌లో (ప్రభుత్వ జూనియర్ కళాశాల), ఎస్‌ఏ ఇంగ్లిష్, ఎస్‌ఏ బయోసైన్స్ ఉపాధ్యాయులకు ఈ నెల 3, 4వ తేదీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హనుమాన్‌నగర్(సూర్యాపేట)లో, అలాగే 3, 4వ తేదీల్లో ఎస్‌ఏ మ్యాథ్స్, ఎస్‌ఏ సోషల్ ఉపాధ్యాయులకు కుడకుడ జెడ్పీహెచ్‌ఎస్‌లో, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు 3, 4వ తేదీల్లో నల్లగొండ డైట్ కళాశాలలో, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు 3, 4 తేదీల్లో దురాజ్‌పల్లి సమీపంలోని ఎంఎస్‌ఆర్ సెంట్రల్ స్కూల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

రెండు రోజులపాటు వృత్యంతర శిక్షణ



నూతనంగా పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు జిల్లాస్థాయిలో వృత్యంతర శిక్షణ ఈ నెల 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్నాం. జిల్లాలో 714 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకానున్నారు. సమర్థవంతమైన తరగతి గది బోధనా, అభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన పద్ధతులు అందుబాటులో గల సాంకేతిక పరికరాల వినియోగం తదితర విషయాలపై శిక్షణ ఇస్తారు. ఉపాధ్యాయులకు బోధనలో శక్తి సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా పాఠశాలలను అభివృద్ధిలోకి తేవడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ఈ శిక్షణ కార్యక్రమం ఉద్దేశం.

–అశోక్, డీఈఓ

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- లింక్ క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ
- ఎస్పీ నరసింహ



మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేటటౌన్ : సైబర్ నేరగాళ్లు అత్యాశ చూపి అందినంత దండుకుంటున్నారు. నకిలీ వెబ్‌సైట్లు, క్యూర్ కోడ్స్, లింక్‌లు పంపి క్లిక్ చేయాలని, బహుమతులు వచ్చాయని, ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా సరిచూసుకోవాలని చెప్పి డబ్బులు కాజేస్తున్నారు. అప్రమత్తతతో సైబర్ నేరాలను అరికట్టవచ్చని అంటున్నారు ఎస్పీ కే నరసింహ. ప్రజలు సైబర్ నేరగాళ్ల మోసాల బారిన పడకుండా సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

మోసాలు ఇలా..

- కాల్ సెంటర్లు, సైబర్‌క్రైం పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సీబీఐ అధికారులమంటూ ఫోన్ చేస్తారు.
- బ్యాంక్ ఉద్యోగి అని చెప్పి ఖాతాదారుడికి ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, ఆధార్‌కార్డు, పాన్ కార్డు లాంటి వివరాలు అడుగుతారు.
- తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయి అని ఆశపెడతారు.
- ఫోన్‌కు, మెయిల్‌కు, సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాంలలో మెసేజ్‌లు, బ్లూ లింక్ పంపుతారు.
- బహుమతులు వచ్చాయని, తక్కువ రేటుకు వస్తువులు వాహనాలు ఉన్నాయని, మంచి ఉద్యోగాలు ఉన్నాయి అని చెప్పి ప్రాసెసింగ్, రిజిస్ట్రేషన్‌కు ఫీజు కట్టాలి అని చెబుతారు.
- మీ పిల్లలు డ్రగ్స్ కేసులో, అక్రమ రవాణా కేసుల్లో ఇరుకున్నారని, కేసుల నుంచి తప్పిస్తాం అంటూ కస్టమ్స్, సీఐడీ, ఈడీ, సైబర్ క్రైం పోలీసు అధికారులం అంటూ బెదిరింపులకు గురి చేస్తారు

సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే..

- లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలి.
- సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోయినా, మీ డబ్బు పోగొట్టుకున్నా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి
- కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్‌లో వెతకవద్దు. ఆయా సంస్థల అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే కస్టమర్ కేర్ నంబర్లను పొందాలి.
- అపరిచిత నంబర్ల నుంచి ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించవద్దు.
- లాటరీ ఆఫర్లంటూ వచ్చే మెసేజ్‌ను నమ్మవద్దు.
- పాస్వర్డ్, ఓటీపీ వివరాలను ఎట్టి పరిస్థితుల్లో ఎవరికీ షేర్ చేయవద్దు.
- బ్యాంక్‌లో వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తాం అంటే ఎవ్వరికీ ఆధార్, బ్యాంక్ ఖాతా లాంటివి చెప్పవద్దు.
- సైబర్ నేరం జరిగిన మొదటి గంటలోనే (గోల్డెన్ అవర్) ఫిర్యాదు చేయడం ద్వారా స్కామర్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేసి పోయిన డబ్బు రికవరీ చేయడం సులభం అవుతుంది.

గ్రామ పోలీసు అధికారి వ్యవస్థ బలోపేతం చేయాలి



రివార్డు అందుకున్న సిబ్బందితో ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా గ్రామ పోలీసు అధికారి వ్యవస్థను బలోపేతం చేసేలా ప్రణాళిక రూపొందించామని ఎస్పీ కె.నరసింహ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు ప్రజా భరోసా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి బుధవారం పోలీసు ప్రజా భరోసా కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యలు గుర్తించడం, చట్టాలు, భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం, సమస్యలు సృష్టించే వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా నేరాలను అదుపుచేయడమే ఈ కార్యక్రమంలో ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సీఐలు చరమంద రాజు, రజిత, శివశంకర్, రాజశేఖర్, వీరరాఘవులు, రామకృష్ణారెడ్డి, రఘువీర్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, సైబర్ సెక్యూరిటీ సీఐ లక్ష్మీనారాయణ, ఆర్ఐ నారాయణరాజు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీసులకు రివార్డు

సూర్యాపేటటౌన్ : కోదాడ పట్టణంలో 2023 సంవత్సరం నవంబర్ నెలలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నవారిని అరెస్టు చేసి రూ.68 వేలు సీజ్ చేసి వారిని కోర్టులో హాజరుపరిచారు. సీజ్ చేసి కోర్టుకు పంపిన రూ.68 వేలలో రూ.34 వేలను పోలీసులకు రివార్డ్‌గా ఇస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కాగా ఆ సమయంలో పనిచేసిన సీఐ రాము, ఎస్ఐ రామాంజనేయులు, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సతీష్, వెంకటేశ్వర్లు, శ్రీనులకు రివార్డ్ నగదును ఎస్పీ నరసింహ మంగళవారం అందజేశారు.

క్లుప్తంగా

రెండు వర్గాల మధ్య ఘర్షణ

మునగాల: మునగాల మండలం రేపాల గ్రామంలో మంగళవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాల మధ్య కొబ్బరికాయ కొట్టే సమయంలో, ఫొటోలు దిగే విషయంలో ఘర్షణ జరిగింది. తమ వర్గమే బియ్యం పంపిణీని ప్రారంభించాలని ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కొందరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇరువర్గాలను సర్దిజెప్పి పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పెద్దఅడిశర్లపల్లి: ఏఎమ్మార్పీ ప్రధాన కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. గుడిపల్లి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన వట్టిపు అంజయ్య(35) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం అంజయ్య తన సమీప బంధువు ఎల్లయ్యతో కలిసి గ్రామ శివారులోని ఏఎమ్మార్పీ ప్రధాన కాలువలో స్నానానికి వెళ్లి.. ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. ఎల్లయ్య అంజయ్య కుటుంబ సభ్యులకు, గుడిపల్లి పోలీసులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కాలువకు నీటి విడుదలను నిలిపివేయించి గాలింపు చర్యలు చేపట్టగా.. మంగళవారం గల్లంతైన ప్రాంతం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో కాలువలో అంజయ్య మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి బోడ యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి మృతి

ఆలేరురూరల్: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. భువనగిరి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి వరంగల్ వైపు రైలు మార్గంలో ఆలేరు–పెంబర్తి మధ్యన రైలు పట్టాలపై మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు రైలు నుండి జారిపడి మృతిచెంది ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, నీలం, తెలుపు రంగు చెక్స్ కలిగిన టీషర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9848222169, 8712568454 నంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు సూచించారు.

నకిలీ మద్యం గుట్టురట్టు

- చండూరు, కనగల్, నాంపల్లి మండలాల్లో పోలీసుల దాడులు
- 80 లీటర్ల స్పిరిట్ లభ్యం

చండూరు, కనగల్, నాంపల్లి: టాస్క్‌ఫోర్స్, ఎస్ఓటీ పోలీసులు చండూరు మండల కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న నకిలీ మద్యం దందా గుట్టురట్టు చేశారు. చండూరు మండల కేంద్రానికి చెందిన ఎర్రజెల్ల రమేష్, కనగల్ మండలం జి.యడవల్లి గ్రామానికి బొమ్మరబోయిన భార్గవ్‌తో పాటు నాంపల్లి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కలిసి ఈ దందా నడిపిస్తున్నట్లు తెలిసింది. మంగళవారం ఏకకాలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేయగా.. భార్గవ్ ఇంటి వద్ద 20లీటర్లు, రమేష్ ఇంటి వద్ద 60లీటర్ల స్పిరిట్ దొరికినట్లు సమాచారం. వారిని విచారించగా.. చండూరు మండలం గుండ్రపల్లి శివారులో, గుర్రంపోడు మండలం, నాంపల్లి మండలాల కూడలిలో రమేష్‌కు సంబంధించిన రెండెకరాల వ్యవసాయ క్షేత్రంలో సుమారు 1500 లీటర్ల నకిలీ మద్యం నిల్వ చేసి ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవసాయ క్షేత్రం చుట్టూ కంచె, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ దందా నాలుగేళ్లుగా కొనసాగుతుందని, ఈ నకిలీ మద్యం దందాలో చండూరుకు చెందిన వ్యక్తులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పది మంది ఉన్నట్లు సమాచారం.

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

నల్లగొండ జిల్లా కేతేపల్లి, తిప్పర్తి మండలాలతో పాటు సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి.

బైక్‌ను ట్రావెల్స్ బస్సు ఢీకొని..


దేవాన్ష్ (ఫైల్)

కేతేపల్లి: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండల కేంద్రంలో మంగళవారం బైక్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో కుమారుడు మృతిచెందగా.. తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామానికి చెందిన అనుముల ప్రవీణ్ హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని తన వ్యవసాయ బావి వద్ద ఉప్పలమ్మ పండగ నిర్వహించేందుకు ప్రవీణ్ తన భార్య, పిల్లలతో కలసి స్వగ్రామానికి వచ్చాడు. పండగ నిర్వహణకు అవసరమైన సామగ్రిని తెచ్చేందుకు కుమారుడు దేవాన్ష్(6)తో కలసి బైక్‌పై మంగళవారం కేతేపల్లికి బయల్దేరాడు. మార్గమధ్యలో కేతేపల్లి శివారులోని నిమ్మలమ చెరువు సమీపంలోకి చేరుకోగానే హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్, అతడి కుమారుడు దేవాన్ష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. దేవాన్ష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మూడ్రోజుల క్రితమే పుట్టినరోజు జరుపుకున్న దేవాన్ష్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దేవాన్ష్ తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపారు.

మహిళా కూలీ..


స్వరాజ్యం (ఫైల్)

మద్దిరాల: కారు ఢీకొని మహిళా కూలీ మృతిచెందింది. ఈ ఘటన మద్దిరాల మండలం కుంటపల్లి గ్రామంలో సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగింది. ఏఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం గ్రామానికి చెందిన అలువాల స్వరాజ్యం(58) భర్త 30 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి పెళ్లిళ్లు చేసింది. స్వరాజ్యం చుట్టుపక్కల గ్రామాల్లో కూలీ పనికి వెళ్తూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఆమె మద్దిరాల మండలం కుంటపల్లి గ్రామంలో ఓ రైతుకు మిర్చి తోటలో మిర్చి ఏరడానికి బయల్దేరింది. ఆటోలో కూలీలు ఎక్కువ కావడంతో రైతు ద్విచక్ర వాహనంపై స్వరాజ్యంతో పాటు గోడిశాల సరోజన కలిసి కుంటపల్లి గ్రామానికి వెళ్లారు. వీరితో పాటు వచ్చిన ఆటోను గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర నిలపడంతో బైక్ దిగిన అలువాల స్వరాజ్యం ఆటో వద్దకు వెళ్లి తోటి కూలీలతో మాట్లాడుతుండగా.. సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారి పై మద్దిరాల నుంచి దంతాలపల్లి వైపు వెళ్తున్న కారు స్వరాజ్యాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వరాజ్యం అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి చిన్న కుమార్తె ధర్మారపు రేణుక ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కారు డ్రైవర్..


పాండు (ఫైల్)

తిప్పర్తి: రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండలం దుప్పలపల్లి వద్ద మంగళవారం జరిగింది. వివరాలు.. తిరుమలగిరి(సాగర్) మండలం తునికినూతల గ్రామానికి చెందిన పాతులోతు పాండు (29) మిర్యాలగూడలో నివాసముంటూ క్యాబ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామానికి చెందిన రూపావత్ సైదానాయక్, తన భార్య సౌజన్య, కుమార్తె నిహారిక, కుమారుడు ఉజ్వల్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్లేందుకు మంగళవారం క్యాబ్ బుక్ చేసుకోవడంతో వారిని ఎక్కించుకుని పాండు హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో తిప్పర్తి మండలం దుప్పలపల్లి సమీపంలో వీరి కారును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న పాండు అక్కడికక్కడే మృతిచెందాడు. సైదానాయక్ కుమార్తె నిహారికకు గాయాలయ్యాయి. సైదానాయక్ హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ(డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో..

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం చెరువు కట్ట వద్ద మంగళవారం రాత్రి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన జనార్దన్ (36) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రం నుంచి సూర్యాపేట వెళ్తుండగా.. సింగారెడ్డిపాలెం గ్రామ శివారులోని చెరువు కట్ట సమీపంలో ధాన్యం లోడ్‌తో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జనార్దన్ అక్కడికక్కడే మృతిచెందాడు.

గ్రూప్–1లో ఉత్తమ ర్యాంకులు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే..


రేగట్టె సాయికిరణ్‌రెడ్డి

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామానికి చెందిన రైతు రేగట్టె వేణుగోపాల్‌రెడ్డి, రజిత దంపతుల కుమారుడు సాయికిరణ్‌రెడ్డి గ్రూప్–1లో 501.5 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 49వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 21వ ర్యాంకు సాధించారు. సాయికిరణ్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురుకుల్ విద్యాపీఠ్‌లో 10వ తరగతి, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో గల ఎస్ఆర్ఐ అకాడమీలో ఇంటర్మీడియట్, ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్(మెకానికల్) చదివారు. 2017లో రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో గ్రామ కార్యదర్శిగా, 2018లో డిఫెన్స్‌లో లెఫ్టినెంట్‌గా, 2019లో ఆంధ్రప్రదేశ్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా, 2021లో సెంట్రల్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ ఆఫీసర్ ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో గల సెంట్రల్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ ఆఫీసర్‌గా కొనసాగుతూ గ్రూప్–1కు ప్రిపేరై అత్యుత్తమ ర్యాంకు సాధించారు. తన విజయం వెనుక తన భార్య ప్రతీకరెడ్డి, తల్లిదండ్రులు వేణుగోపాల్‌రెడ్డి, రజితల ప్రోత్సాహం ఎంతో ఉందని సాయికిరణ్‌రెడ్డి తెలిపారు.

గ్రూప్–4 నుంచి గ్రూప్–1 అధికారిగా..


యరగాని నవీన్‌గౌడ్

హుజూర్‌నగర్: గ్రూప్–1 ఫలితాల్లో హుజూర్‌నగర్‌కు చెందిన యరగాని నవీన్‌గౌడ్ 472 మార్కులతో రాష్ట్రస్థాయిలో 210వ ర్యాంక్ సాధించారు. ప్రస్తుతం గ్రూప్–4 ఉద్యోగం చేస్తూనే ఆయన గ్రూప్–1 ఉద్యోగానికి ఎంపికయ్యారు. నవీన్‌గౌడ్ 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు హుజూర్‌నగర్‌లో, నాగార్జునసాగర్ గురుకుల పాఠశాలలో 8, 9, 10 వరకు విద్యనభ్యసించారు.. ఇంటర్ విజయవాడలో, ఐఐటీ బాంబేలో ఇంజనీరింగ్ చదివారు. నవీన్‌గౌడ్ గ్రూప్–1 ఉద్యోగం సాధించడంతో అతడి తల్లిదండ్రులు యరగాని జయలక్ష్మి, గురవయ్య హర్షం వ్యక్తం చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలిపెట్టి..


తల్లిదండ్రులతో తరుణ్ చక్రవర్తి

చౌటుప్పల్ రూరల్: గ్రూప్–1 ఫలితాల్లో చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన వనం తరుణ్ చక్రవర్తి రాష్ట్ర స్థాయిలో 148వ ర్యాంకు సాధించారు. తరుణ్ చక్రవర్తి తల్లిదండ్రులు వనం శ్రీలత, శ్రీనివాసులు ప్రభుత్వ టీచర్లుగా పనిచేస్తున్నారు. తరుణ్ చక్రవర్తి ప్రాథమిక విద్య భువనగిరిలోని మదర్‌థెరిస్సా హైస్కూల్‌లో కొనసాగింది. చలకుర్తిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 10వతరగతి వరకు చదివారు. ఇంటర్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో, వరంగల్‌లోని ఎన్ఐటీలో బీటెక్(కంప్యూటర్ సైన్స్) పూర్తి చేశారు. చదువు పూర్తయిన తర్వాత రెండేళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఉద్యోగానికి రాజీనామా నాలుగేళ్లుగా ప్రిపేర్ అవుతున్నారు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–1లో 148వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. పక్కా ప్రణాళికతో చదివితే విజయం సాధించవచ్చని తరుణ్ చక్రవర్తి తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకర్

బీబీనగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులు, ఒక బాలుడిని బీబీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామానికి చెందిన ముల్కలపల్లి రమేష్, హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌కు చెందిన టేకుల మనీష్‌తో పాటు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కొండాపూర్‌కు చెందిన బాలుడు కలిసి హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌లో సింగ్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలోకి మార్చి బీబీనగర్ పరిసర గ్రామాల్లో యువకులకు విక్రయిస్తున్నారు. మార్చి 31న సాయంత్రం బీబీనగర్ మీదుగా వీరు బైక్‌పై వెళ్తుండగా.. వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకోగా.. వారి వద్ద 160గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐలు రమేష్, అమర్‌సింగ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాము, జనార్దన్‌ను సీఐ అభినందించారు.

89 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

గుండాల: గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఖాసీం 89 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తన ఇంట్లో నిల్వ చేసినట్లు పక్కా సమాచారం మేరకు భువనగిరి ఎస్ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతో పాటు మూడు కాంటాలు, రెండు బస్తాలు కుట్టే మిషన్లు, రెండు ఓమ్నీ వ్యాన్‌లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ జి. సైదులు తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో భువనగిరి ఎస్ఓటీ సభ్యుడు మహేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ యశ్వంత్‌రావు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ దుకాణం దగ్ధం


నడిగూడెం: దగ్ధమైన కిరాణ దుకాణం

నడిగూడెం: నడిగూడెం మండల పరిధిలోని రామాపురం గ్రామంలో సంగెం రామకృష్ణ నిర్వహిస్తున్న కిరాణ దుకాణంలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో కిరాణ దుకాణంలోని రెండు రిఫ్రిజిరేటర్లతో పాటు పలు వస్తువులు, కిరాణ సరుకులు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంతో సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

గ్యాస్ సిలిండర్ పేలి..

అర్వపల్లి: గ్యాస్ సిలిండర్ పేలి ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మాల గ్రామానికి చెందిన వీఓఏ శిగ యాదమ్మ తన ఇంట్లో మంగళవారం వంట చేసుకుంటుండగా ఒక్కసారిగా సిలిండర్ పేలింది. దీంతో ఆమె బయటకు పరుగు తీసింది. సిలిండర్ పేలుడు ధాటికి మంటలు లేచి మంచాలు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. మహిళా సంఘాలకు చెందిన పుస్తకాలు కూడా కాలిపోయాయి. చుట్టుపక్కల వారు గమనించి నీళ్లు పోసి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

వృద్ధుడిపై యువకుల దాడి

- రూ.1.53లక్షలు దోపిడీ

మునగాల: వృద్ధుడిపై ఐదుగురు యువకులు దాడి చేసి రూ.1.53లక్షలు ఎత్తుకెళ్లారు. బాధితుడి కుమారుడు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం తాడువాయి గ్రామానికి చెందిన గునగంటి మాణిక్యం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులు తీసుకుని మంగళవారం సాయంత్రం టీవీఎస్ మోపెడ్‌పై ఇంటికి వస్తుండగా.. మార్గమధ్యలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చివ్వెంల మండలం గుంజలూరు గ్రామ స్టేజీ వద్ద ఐదుగురు యువకులు అతడిపై దాడి చేసి రూ.1.53లక్షల నగదు లాక్కెళ్లారు. ఈ విషయాన్ని తాడువాయిలో ఉన్న తన కుమారుడు లక్ష్మయ్యకు ఫోన్ ద్వారా మాణిక్యం తెలియజేశాడు. లక్ష్మయ్య హుటాహుటిన ఘటనా స్థలం వద్దకు చేరుకుని తండ్రిని అడిగి వివరాలు తెలుసుకున్నాడు. అనంతరం మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద గల ఓ హోటల్‌లో సదరు యువకులు టీ తాగుతుండగా గుర్తించిన లక్ష్మయ్య.. వారి వద్దకు వెళ్లి తన తండ్రి వద్ద నగదు ఎందుకు లాక్కున్నారని అడగడంతో లక్ష్మయ్యపై కూడా యువకులు రాళ్లతో దాడి చేసి పరారయ్యారు. తనపై దాడి చేసిన వారిలో ముగ్గురు మునగాల మండల కేంద్రానికి చెందిన వ్యక్తులుగా గుర్తించిన లక్ష్మయ్య మునగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే దోపిడీ జరిగిన ప్రాంతం చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుండడంతో అక్కడ కూడా ఫిర్యాదు చేసినట్లు లక్ష్మయ్య తెలిపాడు.

ముక్త్యాల బ్రాంచ్ కాలువలో ఆటో బోల్తా

- ఆరుగురికి గాయాలు

మునగాల: మునగాల మండలం బరాఖత్‌గూడెం శివారులో గల ముక్త్యాల బ్రాంచ్ కాలువలో మంగళవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బొంతు వీరన్న, తన సోదరుడి భార్య భవానీతో పాటు మరో ముగ్గురు పిల్లలను ఆటోలో ఎక్కించుకుని కోదాడ మండలం చిమిర్యాల గ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో మునగాల మండలం కృష్ణానగర్ గ్రామానికి చెందిన జమున కూడా ఆటోలో ఎక్కింది. ఆటో మునగాల మండలం బరాఖత్‌గూడెం శివారులో ముక్త్యాల బ్రాంచ్ కాలువ వెంబడి వెళ్తుండగా.. ఎదురుగా మరో ఆటో రావడంతో వీరి ఆటో అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వీరన్నతో పాటు భవానీ, ముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. జమునకు తీవ్రగాయాలు కాగా.. స్థానికులు చికిత్స నిమిత్తం ఆమెను 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మునగాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


కాలువలో బోల్తాపడిన ఆటో

దాసి సుదర్శన్ ఆశయ సాధనకు కృషిచేయాలి


సభలో మాట్లాడుతున్న ఎంవీ రమణారెడ్డి


హాజరైన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు

నాగార్జునసాగర్: ప్రముఖ చిత్రకారుడు, జాతీయ అవార్డు గ్రహీత దాసి సుదర్శన్ ఆశయాలు నెరవేర్చేందుకు సాహితీవేత్తలు, కవులు, కళాకారులు కృషిచేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. దాసి సుదర్శన్ మొదటి వర్ధంతిని పురస్కరించుకుని నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో గల ఆయన నివాసంలో వారి మిత్రులు, సహచరులు, శిష్యులు, అభిమానులు కవులు, కళాకారులు, రచయితలు కలిసి దాసి సుదర్శన్ స్మారక చిత్రకళా నిలయం ఏర్పాటు చేశారు. దీనిని హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవీ రమణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ చిత్రకళా నిలయాన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి కళాకారులకు ఉపయోగపడేలా ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. రచయిత ప్రసేన్ మాట్లాడుతూ.. దాసి చిత్రం తెలంగాణలోని గడీల్లో అణచివేతను, బాంచెన్ దొర బతుకులను సెల్యులాయిడ్‌పై ప్రతిబింబించిందన్నారు. తెలంగాణ ప్రజల జీవితాలను ఉన్నతీకరించి చూపిందన్నారు. నాటి దాసి నుంచి నేటి చావా చిత్రం వరకు జరిగిన చరిత్ర వక్రీకరణను విశ్లేషించారు. చిత్రాకళా నిలయంలో ప్రముఖ రచయితలు వేణు, సంతోష్, జర్నలిస్టు కృష్ణమూర్తి, కార్టూనిస్టు శంకర్, విజయ్, కూరెళ్ల వెంకట్, ఆనంద్ గీసిన చిత్రాలను ఉంచారు. కార్యక్రమంలో పాండురంగారావు, ప్రభాకర్, కిరణ్మయి, మోహన్, మున్న, హరి, శ్రీనివాస్, సమతా ప్రసాద్, రామ్మోహనరాజు, కర్తయ్య, కేవీ రఘు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వ్యక్తుల అరెస్ట్

- 25 బైక్‌లు స్వాధీనం


పట్టుబడిన యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని బహిరంగ ప్రదేశాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో మద్యం సేవించడంతో పాటు రాత్రి వేళ కారణం లేకుండా తిరుగుతున్న వ్యక్తులు, యువకులను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. అదుపులోకి తీసుకున్న యువకులను, వారి నుంచి స్వాధీనం చేసుకున్న 25 బైక్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ కె. రాజశేఖర్ రాజు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో కొంతమంది యువకులు మద్యం, గంజాయి సేవిస్తున్నారని సమాచారం ఉందని తెలిపారు. మొదటిసారి పట్టుబడడంతో కౌన్సెలింగ్ ఇస్తున్నామని, మరోసారి పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. పట్టుబడిన వాహనాల్లో రెండింటికి ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు సోమనర్సయ్య, మోతీరాం, పీఎస్‌డీ ప్రసాద్, ఎస్ఐలు కృష్ణయ్య, సైదులు, సంజీవరెడ్డి, వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులో గల శ్రీఅన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ అనాథాశ్రమంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని మెట్రో హాస్పిటల్ ముందు కూర్చోని ఉన్న గుర్తుతెలియని వ్యక్తి(35)కి హాస్పిటల్ సిబ్బంది అన్నం పెట్టగా తినకపోవడంతో మార్చి 30న శ్రీఅన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ అనాథాశ్రమంలో చేర్పించారు. అక్కడ రెండురోజుల పాటు నీరసంగా ఉన్న అతడు మంగళవారం మృతిచెందాడు. ఆశ్రమ నిర్వాహకురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నీలం రంగు జీన్స్, నేవీ బ్లూ రంగు షర్ట్ ధరించాడని, వివరాలు తెలిసిన వారు 8712686031 నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

విద్యుదాఘాతంతో హార్వెస్టర్ డ్రైవర్ మృతి

కట్టంగూర్: విద్యుదాఘాతంతో హార్వెస్టర్(వరికోత మిషన్) డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన కట్టంగూర్ మండల కేంద్రం శివారులోని బిల్లంకానిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన యువకుడు(26) కట్టంగూర్ మండల కేంద్రం శివారులో బిల్లంకానిగూడెం సమీపంలో ఓ రైతు పొలంలో వరికోత మిషన్‌తో వరి పంటను కోస్తుండగా విద్యుత్ తీగలు మిషన్‌కు తాకాయి. దీంతో ఒక విద్యుత్ తీగ తెగి పొలంలో పడింది. డ్రైవర్ కిందకి దిగగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడి పూర్తి వివరాలు తెలియరాలేదు. పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రవీందర్ తెలిపారు.

కూరగాయల సాగులో కలుపు నివారణ


నడిగూడెంలో సాగు చేస్తున్న టమాట

పాడిపంట

నడిగూడెం: రైతులు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని అంతర్గత పంటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్‌కుమార్ చెబుతున్నారు. వేసవిలో కూరగాయల సాగులో మెళకువలు పాటిస్తూ, ఎప్పటికప్పుడు కలుపు నివారణ చర్యలు తీసుకుంటే అధిక పంట దిగుబడి పొందవచ్చని అంటున్నారు. శాశ్వత పందిళ్లలో సొర, బీర, కాకర, గుమ్మడి, దొండ, పందిరి కింద టమాట, బెండ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, పంటలను సాగు చేసి అధిక లాభాలను రైతులు పొందవచ్చన్నారు. ఉద్యానవన పంటల్లో కలుపు నివారణ చర్యలపై సలహాలు సూచనలు ఆయన మాటల్లోనే..

సొర, బీర, కాకర, గుమ్మడి, దోస, పంటల్లో కలుపు నివారణ చర్యలు

- విత్తిన వెంటనే వాడదగిన కలుపు మందులు పెండిమిథలిన్ 30 శాతం ఈసీ లేదా అలాక్లోర్ 50 శాతం ఈసీ అనే మందును 1–1.25 లీ. విత్తిని రెండు రోజుల్లోపు తేమ గల నేలపై పిచికారీ చేయాలి. 20 నుంచి 25 రోజుల మధ్య ఒకసారి అంతర కృషి చేసుకోవాలి.
- పైరు, కలుపు మొలకెత్తిన తర్వాత క్విజులోఫాస్ ఇథైల్ 5 శాతం ఈసీ 400 మి.లీ. లేదా క్విజులోఫాస్ 10 శాతం ఈసీ 150 నుంచి 175 మి.లీ. లేదా ప్యాపాక్విజాఫాస్ 10 శాతం ఈసీ 250 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీనిని గడ్డిజాతి కలుపు నివారణకు వాడాలి.

టమాట సాగులో..

- విత్తిన వెంటనే వాడదగిన కలుపు మందులు పెండిమిథలిన్ 30 శాతం ఈసీ లేదా అలాక్లోర్ 50 శాతం ఈసీ ఒక లీటరు మందును ఎకరాకు విత్తిన లేదా నాటిన రెండు రోజుల్లోపు తేమ గల నేలపై పిచికారీ చేసుకోవాలి. 20 నుంచి 25 రోజుల మధ్య ఒకసారి అంతర కృషి చేసుకోవాలి.
- కలుపు మొలకెత్తిన తర్వాత మెట్రిబ్యుజిన్ 70 శాతం డబ్లుపి అనే మందును 300 గ్రాములు, ఎకరానికి లేదా క్విజాలోఫాప్ ఇథైల్ 5 శాతం ఈసీ 400 మి.లీ. లేదా ప్రొపిక్విజాఫాప్ 10 శాతం ఈసీ 250 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి నాటిన 15 రోజుల నుంచి 20 రోజుల్లో పిచికారీ చేస్తే గడ్డి జాతి కలుపు నివారించొచ్చు.

బెండ సాగులో..

- విత్తిన వెంటనే వాడదగిన కలుపు మందులు అయిన పెండిమిథలిన్ 30 శాతం ఈసీ విత్తిన రెండు రోజుల్లోపు ఎకరానికి 1.25 లీ. తేమ గత నేలపై పిచికారి చేయాలి.
- కలుపు మొలకెత్తిన తర్వాత క్విజాలోఫాఫ్ ఇథైల్ 5 శాతం ఈసీ 150 నుంచి 175 మి.లీ. లేదా ప్రొపిక్విజాఫాప్ 10 శాతం ఈసీ 250 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇది గడ్డి జాతి కలుపు నివారణకు ఉపయోగపడుతుంది.